సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్‌లో స్టార్టప్‌లు షురూ..

సిటీబ్యూరో, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీలోని స్టేట్ ఆఫ్ ఆర్ట్ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో బయోసైన్స్ స్టార్టప్‌ల కార్యకలాపాలు మొదలయ్యాయి. బయో, లైఫ్ సైన్సెస్ రంగంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇటీవలే ఈ ఇంక్యుబేటర్‌ను ప్రారంభించారు. వినూత్న ఆవిష్కరణలకు రూపకల్పన చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామని, తాజాగా కార్యాకలాపాలు ప్రారంభించిన స్టార్టప్‌లను ఉన్నతంగా ఎదిగేందుకు అనువైన ఆంత్రప్రెన్యూర్‌షిప్ వాతావరణం సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్‌లో ఉందని, తాజాగా కార్యాకలాపాలు ప్రారంభించిన స్టార్టప్ నిర్వాహకులను సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఉల్లాస్ కొల్తూర్ అభినందించి, ఏంఓయూ పత్రాలను అందజేశారు.

ప్రజా సంక్షేమం గాలికి

ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలకు చెల్లు చీటి

ప్రజా సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ పాలకులు

రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిలిచి, ఎంపీగా గెలిపిద్దాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చిత్రంలో మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం కురుమ, బొగ్గారపు దయానంద్ గుప్త

మన్సూరాబాద్, ఏప్రిల్ 13: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈఆర్ గార్డెన్స్‌లో శనివారం మన్సూరాబాద్, నాగోల్, వనస్థలిపురం, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం కురుమ, బొగ్గారపు దయానంద్ గుప్త, మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి ప్రజలను గారడి మాటలతో మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వస్తున్నదని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినప్పటికీ ప్రజలకు ఒరిగిందేమిలేదని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేయాలని సూచించారు. కరెంటు సరఫరా లేకపోవడం.. నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ పార్టీకి మాత్రం చీమ కుట్టినట్టు లేదని ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం కురుమ, బొగ్గారపు దయానంద్ గుప్త తెలిపారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా ఉన్నదన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు బరిలో ఉన్న ఇతర పార్టీల అభ్యర్థులు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారని తెలియజేశారు. స్థానికుడైన రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా..

మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని, అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల ఆధ్వర్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధితో నగర రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ఎల్బీనగర్, ఉప్పల్ తదితర కూడళ్లలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ రోడ్ల నిర్మాణాలు చేపట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యకర్తలు సమష్టిగా పని చేసి బీఆర్ఎస్ గెలుపులో పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, నాయకులు గజ్జెల మధుసూదన్ రెడ్డి, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, అనంతుల రాజిరెడ్డి, కత్తుల రాంబాబు, టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీష్ యాదవ్, వివిధ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, తూర్పాటి చిరంజీవి, చింతల రవి కుమార్, చెన్నగోని శ్రీధర్ గౌడ్, కటిక రెడ్డి అరవింద్ రెడ్డి, వివిధ డివిజన్ల మహిళా అధ్యక్షురాళ్లు కొసనం ధనలక్ష్మి, అంజలి, లత, ప్రమీల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కాంగ్రెస్ రాకతో.. 60 ఏండ్లు వెనక్కు..

- రైతులను ఇబ్బంది పెట్టే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవ్
- మల్కాజిగిరిలో ఎగిరేది.. ఎదిగేది బీఆర్ఎస్ జెండానే
- బీఆర్ఎస్ పథకాలు.. ప్రజల హృదయాల్లో నాటుకుపోయాయి
- మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

జవహర్‌నగర్, ఏప్రిల్ 13: ఆరు గ్యారెంటీల పథకాల పేరుతో తెలంగాణ ప్రజలను అడ్డంగా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులుండవని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ వచ్చి.. తెలంగాణకు కరువు తీసుకొచ్చిందని, బీఆర్ఎస్ తెచ్చిన పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతున్నాయని, మల్కాజిగిరిలో బీఆర్ఎస్ జెండానే ఎగురుతుందని, గులాబీ దళానికే ఎదుగుదల ఉన్నదని ఆయన అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు ఒరగబెట్టిందిలేమీ లేదని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ ప్రగతి బాటకు ఎక్కించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసమే నాయకులు పార్టీలు మారుతున్నారని, కార్యకర్తలు బీఆర్ఎస్‌కు వెన్నంటే ఉన్నారని, ఎవ్వరూ అధైర్య పడొద్దని, అండగా ఉంటానన్నారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడాలని, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని, తాలు మాత్రమే కొట్టుకుపోతున్నదని, బలమైన కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, జవహర్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప, సీనియర్ నాయకులు రాజశేఖర్, చందర్, నర్సింహ యాదవ్, బండకింది ప్రసాద్ గౌడ్, జక్కుల భాస్కర్, సిద్ధులు యాదవ్, సాధిక్, సతీశ్ యాదవ్, మహేందర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ మాదిగ వాడలోనూ.. రేవంత్‌ను తిరగనివ్వం

మాదిగలకు టికెట్ కేటాయించని కాంగ్రెస్‌పై మండిపాటు

బీజేపైనా మాదిగలకు టికెట్ కేటాయించాలి

ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ

కంటోన్మెంట్, ఏప్రిల్ 13: రాష్ట్రంలో ఏ మాదిగ వాడలోనూ సీఎం రేవంత్‌రెడ్డిని తిరగనివ్వబోమని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ హెచ్చరించారు. రాష్ట్రంలోని 85 లక్షల మంది ఉన్న మాదిగలకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలతో కంటోన్మెంట్‌లో జరుగుతున్న ఉప ఎన్నికలోనూ ఒక్క సీటు కేటాయించలేదని, అందుకు ఎంపీ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఎన్నికలో తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం కంటోన్మెంట్ డైమండ్ పాయింట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటుక శ్రీకిషన్ మాదిగ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మాదిగల ఓట్లతో గెలిచి, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులైన మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. నిన్న మొన్న కాంగ్రెస్ పార్టీని తిట్టిన వారికి టికెట్లు కేటాయించడం పట్ల మాదిగ సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూడటమేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తే అడుగడుగునా అడ్డుకొని ఓటే ఆయుధంగా తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలను విస్మరించి వివక్ష చూపిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను అధికారం నుంచి దింపే వరకు తమ ఆత్మ గౌరవ ఉద్యమ పోరాటం ఆగదన్నారు. మాలలతో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. ఇంకా అభ్యర్థిని ప్రకటించని బీజేపీ అయినా మాదిగ అభ్యర్థిని ప్రకటించాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు అజిత్ కళ్యాణ్, రొట్టెల సునీల్, మందా మధుకర్, మురళీ, నర్సింహ, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి

బొల్లారం, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా నివేదితను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో శనివారం బొల్లారంలో మాజీ సభ్యుడు లోక్‌నాథ్ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, కంటోన్మెంట్‌నే కుటుంబంగా భావించిన గొప్ప వ్యక్తి సాయన్న అని, ఆయన బతికినంత కాలం నిస్వార్థంగా ప్రజాసేవ చేశారని గుర్తు చేశారు. అటువంటి ప్రజా సేవకు అంకితమైన కుటుంబానికే కేసీఆర్ అవకాశం కల్పించారని, దురదృష్టవశాత్తు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడం, దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నివేదితను, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, లోక్‌నాథ్ తదితరులు

మంద కృష్ణ మాదిగ అంబేద్కర్ వ్యతిరేకి..

ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 13: దేశంలో బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తీసుకువచ్చిన అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లను సమర్థిస్తున్న మంద కృష్ణ మాదిగ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విధానాలు, ఆశయాలకు వ్యతిరేకి అని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మండిపడ్డారు. సామాజిక అసమానతల పునాదిగా, కుల వివక్షను ఎదుర్కొంటున్న వారి కోసం రిజర్వేషన్లు తీసుకువస్తే అందుకు విరుద్ధంగా అగ్రవర్ణ పేదలు దేశంలో కేవలం ఐదు శాతం ఉంటే ఎలాంటి కమిషన్ వేయకుండా అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధంగా పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని మంద కృష్ణ ఎలా సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. తార్నాకలోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీని దళిత క్రైస్తవుడై ఉండి ఎలా మద్దతిస్తున్నాడో చెప్పాలన్నారు. అగ్ర వర్ణాలు, బీసీలు, ఎస్టీలు క్రైస్తవ మతంలోకి మారితే రద్దు గాని రిజర్వేషన్లు, కేవలం దళితులు క్రైస్తవులుగా మారితే మాత్రమే రద్దవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని 25, 26 అధికరణలు బోధిస్తున్న మత స్వేచ్ఛకు ఇది విరుద్ధమన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చి, మనుధర్మం అమలు చేయడం ద్వారా బహుజనులను శాశ్వతంగా బానిసలుగా మార్చే సిద్ధాంత భూమిక కలిగిన బీజేపీని మంద కృష్ణ సమర్థించడమంటే అంబేద్కర్ ఆశించిన సమ సమాజ స్థాపనకు వ్యతిరేకిగానే భావించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

రేపటి నుంచి పద్మారావు పాదయాత్ర

సికింద్రాబాద్, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ ఈ నెల 15 నుంచి బౌద్ధనగర్ డివిజన్‌లో ఎన్నికల పాదయాత్ర నిర్వహిస్తారని ఆయన కార్యాలయ అధికారులు శనివారం తెలిపారు. నాయకులు, ఉద్యమకారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువత, విద్యార్థి, కార్మిక విభాగాల నేతలు, అనుబంధ సంఘాల నేతలు, పోలింగ్ బూత్, బస్తీ కమిటీల సభ్యులు, వివిధ పథకాల లబ్ధిదారులు, పజ్జన్న అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పాదయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి పార్సీ గుట్ట మూన్ రాక్ బార్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఓయూ పత్రాలను అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

మేడ్చల్, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): యాసంగిలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మొదట ఆరు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. ఇప్పుడే వరి కోతలు ప్రారంభమైన దశలో మరో వారం 10 రోజులలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. యాసంగి సీజన్‌లో 13,942 ఎకరాలలో వరిసాగు చేయగా, 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసింది. ధాన్యం విక్రయించే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షామియానాలు, మంచినీటి సౌకర్యం, ఇంకా కూర్చునేందుకు వీలుగా కుర్చీలను అందుబాటులో ఉంచారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం, గ్రేడ్–1 క్వింటాలుకు ధర 2,203 గ్రేడ్–2 రకానికి క్వింటాలుకు ధర 2,183లను ఇవ్వనున్నారు.

ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమయ్యే ఏడున్నరల లక్షల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఇవే కాకుండా అదనంగా మరో లక్షన్నర బ్యాగులు అందుబాటులో రానున్నాయని పేర్కొన్నారు. పండించిన పూర్తి ధాన్యం కొనుగోలు చేసేవరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించనున్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రతాపసింగారం, ఎదులాబాద్, మాదారం, కేశవరం, ఉద్దమర్రి, లక్ష్మాపూర్, మూడు చింతలపల్లి, మేడ్చల్, పూడూర్, కీసర, అలియాబాద్, శామీర్‌పేట్‌లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పరిష్కార వ్యవస్థకు కొత్త విధానం అవసరం

ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ రెండు రోజుల సదస్సు

డబ్ల్యూటీవో సభ్యుడు ఉజ్జల్ సింగ్ భాటియా

జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ఉజ్జల్ సింగ్ భాటియా

శామీర్‌పేట, ఏప్రిల్ 13: వివాద పరిష్కార వ్యవస్థకు కొత్త ఆలోచనా విధానం అవసరమని డబ్ల్యూటీవో సభ్యుడు ఉజ్జల్ సింగ్ భాటియా అన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) కింద వివాద పరిష్కార వ్యవస్థకు సంక్షోభాలు, పరిష్కారాలపై అంతర్జాతీయ రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో నల్సార్ లా యూనివర్సిటీలో జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లా సహకారంతో ఈ సదస్సును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉజ్జల్ సింగ్ మాట్లాడుతూ బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థ యొక్క జీవనాధారమైన వివాద పరిష్కారాన్ని పునర్నిర్మించవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. డబ్ల్యూటీవో సంస్థ వివిధ సభ్య దేశాల వైవిధ్యాలు, సవాళ్ళపై స్పృహతో ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో వివాద పరిష్కార సంస్థను పునరుద్ధరించడంలో భారతదేశం చురుకైన పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. తొమ్మిది టెక్నికల్ సెషన్లు, రెండు ప్లీనరీ సెక్షన్లు ఉంటాయని, అంతర్జాతీయ వాణిజ్య చట్టం, సంస్థలతో అనుబంధంగా ఉన్న విద్యావేత్తలు, పండితులు, పరిశోధకులు, విద్యార్థులు క్లిష్టమైన సమస్యలపై, ఆలోచనలపై సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నల్సార్ వీసీ ప్రొఫెసర్ కృష్ణదేవరావు, ప్రొఫెసర్ కపిల్ శర్మ, ట్రేడ్ లా డైరెక్టర్ జస్టిస్ పీఎస్ రావు, డబ్ల్యూటీవో మాజీ చైర్మన్ అప్పీలేట్ బాడీ సభ్యుడు ఉజల్ సింఘ్ భాటియా, అప్పీలేట్ బాడీ సెక్రటేరియట్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వెర్న జ్జౌచ్, నల్సార్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యుల్లతారెడ్డి, ప్రొఫెసర్ జేమ్స్ నెడూమ్, డబ్ల్యూటీవో వివాదాల పరిష్కార సంస్థ మాజీ సభ్యుడు అతుల్ కౌశిక్, మాజీ భారత ప్రభుత్వ అడిషనల్ కార్యదర్శి ప్రొఫెసర్ షీలారామ్, నేషనల్ లా స్కూల్ ఒరిస్సా ప్రొఫెసర్ శైలజా సింగ్, ఆర్వీ అనూరాధ పాల్గొన్నారు.

వైభవంగా బైశాఖి

అమీర్‌పేటలోని ఖల్సా పంత్ ఫౌండేషన్ సెలబ్రేషన్స్ ఆధ్వర్యంలో బైశాఖీ ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. సిక్కు మత సోదరీ సోదరులు ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సిక్కు సోదరులు చేసిన ఖడ్గ విన్యాసాలు వీక్షకులకు కనువిందు చేశాయి.

అమీర్‌పేట్ గురుగోబింద్ స్టేడియంలో శనివారం బైశాఖి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందుకు వివిధ పక్షాలకు చెందిన నాయకులు తరలివచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ గురుద్వారాలో జరిగిన ప్రార్థనల్లో ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఖ్ ప్రముఖులు పద్మారావు గౌడ్‌కు ఖడ్గాన్ని బహూకరించి, ఆయనకు సన్మానం చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంకా పలువురు నేతలు పాల్గొన్నారు.

– అమీర్‌పేట్, ఏప్రిల్ 13